బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

బేల, జూలై 19 : అవల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుధాం రెడ్డి బావ లచ్చరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గంభీర్ ఠాక్రే, నాయకులు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, దేవన్న, ప్రమోద్‌రెడ్డి, సునీల్ , అనిల్‌ఠాక్రే, సురేశ్, రాజారెడ్డి ఉన్నారు.

మైనార్టీ గురుకులం సందర్శన

ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్, జూలై 19 : మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను బుధవారం ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ సందర్శించారు. వంటగదులు, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్ నాయకులు మైనార్టీ గురుకులంలో ఫుడ్ పాయిజన్ అంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. అందులో భాగంగా గురుకులాన్ని సందర్శించి వంట గదులను పరిశీలించామన్నారు. గతంలో మైనార్టీల గురించి కాంగ్రెస్ 70 ఏండ్లలో ఏమి చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. మండలంలో మైనార్టీ గురుకులాన్ని ఎమ్మెల్యే రేఖానాయక్ ఏర్పాటు చేశారన్నారు. మైనార్టీలకు సబ్సిడీ రుణాలు, కుట్టు మిషన్లు, మసీదులకు మరమ్మతు, షాదీముబారక్ లాంటి అనేక పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలతో మైనార్టీలను అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఎన్ని రాజకీయాలు చేసిన కేసీఆర్‌తోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు రషీద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, మాజీ మండలాధ్యక్షుడు సింగారే భరత్, నాయకులు బాజీరావ్, భూమన్న ఉన్నారు.

ఐటీడీఏ పీవోకు సన్మానం

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను బుధవారం ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతం గురించి వివరించారు. అలాగే గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం, మెనూ ప్రకారం భోజనం అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.

మహిళల భద్రతే షీటీం లక్ష్యం

విద్యార్థినులతో షీటీం బృందం సభ్యులు

నార్నూర్, జూలై 19 : మహిళల భద్రతే షీటీం లక్ష్యమని సభ్యురాలు కమల అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాలు, బాల్య వివాహం, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీటీం పని చేస్తుందన్నారు. మహిళలు, యువతులు ఆపదకు గురైతే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం బృందం సభ్యులు భాగ్యశ్రీ, ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బెస్ట్ అవైలెబుల్ స్కూల్స్ లక్కీడ్రా

ఎదులాపురం, జూలై 19: బెస్ట్ అవైలేబుల్ స్కూల్స్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్‌లో 2023-24 విద్య సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని జడ్పీ క్వార్టర్స్ సమీపంలోని అంబేద్కర్ భవనంలో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలెబుల్ స్కూల్‌లో ఒకటి, 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని సూచించారు.

మెరుగైన విద్యను బోధించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- ఆశ్రమోన్నత పాఠశాలలు తనిఖీ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, జూలై 19 : గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలు, మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలల్లో సౌకర్యాలు, వంట గదులను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం తరగతి గదులను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని బట్టి వారికి విద్యాబోధన చేయాలని సూచించారు. అక్షరజ్యోతి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున శుభ్రత పాటించాలని సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత

గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. పీవో క్యాంప్ కార్యాలయంలో ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఏవో రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు , తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు న్యాయం చేయాలి

ఇంద్రవెల్లి, జూలై 19 : మండలంలోని దోడంద గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన రైతులను ఆదుకొని పూర్తి న్యాయం చేయాలని ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు కోరారు. దోడంద గ్రామానికి చెందిన వందమంది ఆదివాసీ గిరిజన రైతులకు పోడు పట్టాలు రాకపోవడంతో వారంతా బుధవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఎంపీడీవో పుష్పలతకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధానకార్యదర్శి పుర్కా బాపురావ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పెందూర్ పుష్పరాణి, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, నాయకులు తురం ధన్ను పెందూర్ అంకుశ్, మెస్రం మురారి, పుసం కరుణబాయి, హీరాబాయి, తుర్సునిబాయి, లచ్చుబాయి, జగ్గేరావ్, దేవ్‌రావ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు కేటాయించాలి

ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

ఎదులాపురం, జూలై 19 : అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు అడ్‌హక్ కమిటీ గౌరవాధ్యక్షుడు దుర్గం శేఖర్ తెలిపారు. అడ్‌హక్ కమిటీ సభ్యులు బుధవారం ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు ఎస్పీకి తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న ఎన్నికల కోసం అవసరమైన బందోబస్తు కేటాయించాలని కోరారు. ఇక్కడ అడ్‌హక్ కమిటీ ప్రధాన కార్యదర్శి అనిల్ స్వాడే, సలహాదారులు గంగారాం బోరేకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదు విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ట్రైనర్

ఉట్నూర్, జూలై 19 : కొత్త ఓటర్ల నమోదు విజయవంతంగా పూర్తిచేయాలని ఆర్డీవో సురేశ్ సూచించారు. బుధవారం స్థానిక కుమ్రంభీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, ఫా6, 6బీ, 7, 8లను ఏవిధంగా ఫిల్ చేయాలో సూచించారు. బీఎల్‌వో యాప్ ద్వారా నిర్వహించాల్సిన కార్యక్రమాలను సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, డీటీ భుజంగ్‌రావ్, మాస్టర్ ట్రైనర్ కపిల్ కుమార్, బానోత్ జగన్, కార్యాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలి

నార్నూర్, జూలై 19 : ఓటరు జాబితా ప్రక్రియను వేగవంతంగా చేయాలని డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్ బూత్ లెవల్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బూత్ లెవల్ అధికారులకు ఓటరు నమోదు ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఓటరు నమోదు చేసే విధివిధానాలపై వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మూడు రోజులుగా ముసురు

ఉట్నూర్ రూరల్, జూలై 19 : మండలంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. లక్కారం, గంగన్నపేట్, మత్తడి చెరువు, గోపాయి, బిర్సాయిపేట్‌లోని పెద్ద చెరువు, బూపేట్ చెరువు, దంతన్‌పల్లిలోని నర్సింహ చెరువు, నాగాపూర్ చెరువులకు భారీగా వరద వస్తున్నది. దీంతో రైతులు వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కురుస్తున్న వర్షాలకు పంట పొలాలపై వరద పారుతున్నది. వాగుల్లో ప్రవాహం ఉధృతంగా మారింది.

పంట పొలాలపై నుంచి పారుతున్న వరద